ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో గాంధీ చూపిన అహింసా మార్గాన్ని అంతా అనుసరిద్దామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా అధికారులతో కలిసి పాల్గొని మాట్లాడారు.


గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా అధికారులు

అహింసా మార్గం.. అనుసరణీయం

కోపం వస్తే.. మౌనం పాటించాలి

కోపం వచ్చినపుడు మౌనం పాటించడంతో అనర్థాల నుంచి గట్టెక్కవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేష్ పేర్కొన్నారు. బుధవారం జన్కాపూర్ ప్రత్యేక ఉప ఉన్నత కారాగారంలో నిర్వహించిన గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి యువరాజాతో కలిసి పాల్గొని మాట్లాడారు. శాంతియుత మార్గంలో దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన గాంధీ పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. కారాగార పర్యవేక్షణాధికారి ప్రేంకుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అంజనీ దేవి, డీఎల్ఎస్ఏ, జైలు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేష్, చిత్రంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజా, జైలు పర్యవేక్షణాధికారి ప్రేంకుమార్


చేనేతకు చేయూత నిధుల విడుదల పత్రాన్ని సొసైటీ కార్యదర్శి కనకయ్య, కార్మికులకు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

చేనేతలకు చేదోడునవుతా

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : చేనేత కార్మికులకు చేదోడుగా ఉంటానని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో చేనేతకు చేయూత పథకంలో ప్రభుత్వ వాటాను విడుదల చేస్తూ జారీ చేసిన పత్రాన్ని కార్మికులకు అందజేశారు. బెజ్జూరు చేనేత సహకార సంఘం కార్యదర్శి నల్ల కనకయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సైతం 20 శాతం వాటా చెల్లించేలా చొరవ చూపాలని, చేనేత కార్మికులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్మికులు జమచేసుకున్న రూ.4.62 లక్షలకు ప్రభుత్వ వాటా రూ.9.64 లక్షలు కలిపి మొత్తం రూ.14 లక్షలు నేరుగా వారి ఖాతాల్లో జమచేశామని తెలిపారు. కార్మికులు తీసుకున్న ముద్ర రుణాల వడ్డీ మాఫీకి కృషిచేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు కుడిక్యాల రాజమౌళి, నాయకులు సిందం శ్రీనివాస్, సామల రాజన్న, గడదాసు మల్లయ్య పాల్గొన్నారు.

కోతకు గురై.. మరమ్మతులకు దూరమై!


ఆసిఫాబాద్‌లోని పెద్దవాగు చెక్‌డ్యామ్ వద్ద తెగిపోయిన మట్టికట్ట, రెండోవైపు ఇసుకలో కూరుకుపోయిన నిర్మాణం

ఆసిఫాబాద్ మండలంలోని పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు ఖర్చు చేశారు. దీనికి ఇరువైపులా ఏర్పాటు చేసిన రింగ్ రిటర్నింగ్ వాల్ ఒకవైపు కోతకు గురైంది. గతేడాది సైతం ఇదే విధంగా జరగగా, పక్కనే ఉన్న మట్టిని తెచ్చి మరమ్మతులు చేశారు. ప్రస్తుత వరదలకు ఈ మట్టికట్ట తెగిపోయింది. ఈ ప్రాంతం నుంచే నీళ్లు మొత్తం కిందకు ప్రవహిస్తున్నాయి. చెక్‌డ్యామ్‌కు మరోవైపు ఉన్న వాల్ పూర్తిగా ఇసుకలో కూరుకుపోయింది. ఈ ప్రాంతం పై నుంచి ఇసుక ట్రాక్టర్లు నిరంతరం వెళ్తున్నాయంటే, ఈ నిర్మాణం ఏరకంగా ఉపయోగపడుతుందో సులువుగా అర్థం చేసుకోవచ్చు.

తిర్యాణి మండలం కోయతలండి గ్రామంలో రూ.2.50 కోట్ల వ్యయంతో చెక్‌డ్యామ్‌ను పూర్తి చేశారు. రెండేళ్ల నుంచే ఈ ప్రాంతం చుట్టూ మట్టికట్టలు కొట్టుకుపోయాయి. అడ్డుకట్ట కింద భాగంలో బుంగ పడడంతో.. నీరంతా కింది నుంచి వృథాగా పోతుంది. వాల్‌కు ఇరువైపులా గండ్లు పడ్డాయి. వానకాలంలో సమీప పంట పొలాల్లో భారీగా వరద నీరు చేరుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలో, లక్ష్మీపూర్‌లో మట్టి కట్టలు నామరూపాల్లేకుండా కొట్టుకుపోవడంతో చెక్‌డ్యామ్‌లు వాగులో అలంకారప్రాయంగా మారాయి.

● జిల్లాలో అలంకారప్రాయంగా చెక్‌డ్యామ్‌లు

ఈనాడు, ఆసిఫాబాద్

పంట పొలాలకు సాగునీరు అందించడంతో పాటు భూగర్భ జలాలను పెంపొందించడానికి రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యామ్‌లు వరద కారణంగా కోతకు గురయ్యాయి. రెండేళ్ల నుంచి సంబంధిత అధికారులెవరూ బాగు చేయకపోవడంతో చుక్కనీరు నిల్వని పరిస్థితి. మరోవైపు నాసిరకం పనులకు నిదర్శనంగా పూర్తయిన ఈ చెక్‌డ్యామ్‌లతో గుత్తేదారుల ధన దాహం మాత్రమే తీరిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం మరమ్మతులు సైతం ప్రారంభించడంలో సంబంధిత అధికారులు పట్టనట్లుగానే ఉంటున్నారు.

మూడు కాలాలపాటు, జీవనదుల్లా ప్రవహించేవి అన్ని మండలాల్లో ఉన్నాయి. మూడు సంవత్సరాల కిందట జిల్లాలో 12 చెక్‌డ్యామ్‌లు మంజూరయ్యాయి. రూ.28 కోట్ల వ్యయంతో పూర్తి చేశారు. ఒక్కొక్క దాని నిర్మాణానికి రూ.2 కోట్ల నుంచి రూ.3.50 కోట్ల వరకు ఖర్చు చేశారు. 2022లో భారీ వర్షాలకు వచ్చిన వరదల సమయంలో అన్ని చెక్‌డ్యాముల మట్టికట్టలు దెబ్బతిన్నాయి. వీటిని గుత్తేదారులు నామమాత్రంగా మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు అవి మళ్లీ కొట్టుకుపోయాయి. ఈ తరుణంలో వరద నీరంతా కిందకి వృథాగా వెళ్లిపోతుంది. డిజైన్ లోపంతోపాటు, ఒకే వాగులో రెండు, మూడు చెక్‌డ్యామ్‌లను నేతల ప్రోద్బలంతో తమకు అనుకూలమైన గుత్తేదారులతో పూర్తి చేశారనే ఫిర్యాదులు ఉన్నాయి.

వాంకిడి మండలంలోని ఒకే వాగు (కమానా)పై మూడు చెక్‌డ్యామ్‌లు పూర్తి చేశారు. ఇందుకు రూ.6 కోట్లు వెచ్చించారు. చెక్‌డ్యామ్‌కు రెండు వైపులా ఉండే రింగ్ రిటర్నింగ్ వాల్‌కు ఆనుకుని ఏర్పాటు చేసే మట్టి కట్టకు తప్పనిసరిగా రాళ్లతో రివిట్‌మెంట్ చేయాలి. వరదలు వచ్చిన తట్టుకునేలా రూపొందించాలి. గుత్తేదారులు రాళ్లను ఉంచకపోవడంతో ఏటా వానకాలంలో ఈ మట్టి కట్టలు తెగిపోతున్నాయి. ఈ తరుణంలో సమీప పంట పొలాలు సైతం మునిగిపోతున్నాయి.


వాంకిడి మండలం కమానా వద్ద రాళ్లతో మట్టి కట్ట ఏర్పాటు చేయకపోవడంతో కొట్టుకుపోయిన తీరు

ఈ నెలలో పనులు ప్రారంభిస్తాం

- గుణవంత్‌రావు, నీటిపారుదలశాఖ ఈఈ

దెబ్బతిన్న చెక్‌డ్యామ్‌లను గుత్తేదారులు మరమ్మతులు చేయాలని చెప్పాం. ఈ నెలలో తప్పకుండా పనులు చేసేలా చూస్తాం.

ఇప్పుడొస్తున్న జ్వరాలు కొందరిని నెలకుపైగా మంచానికే పరిమితం చేస్తున్నాయి. విపరీతమైన ఒళ్లు నొప్పులతో సతమతమవుతున్నారు. ఒకరి సహాయం లేనిదే అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. కొందరికి ముక్కు భాగం నలుపెక్కి ఇబ్బంది పెడుతోంది. దీనిపై పరిశీలించాల్సిన అవసరముందని ఇటీవల జిల్లా కేంద్రంలోని జడ్పీ ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు.. డీఎంహెచ్‌వో తుకారాం దృష్టికి తెచ్చారు.


జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపరీక్షల కోసం ల్యాబ్ వద్ద వేచిఉన్న రోగులు


ఒళ్లు నొప్పులు.. ఆసుపత్రులకు పరుగులు

● జ్వరం తగ్గి నెలలు దాటినా వదలని వైనం!

ఆసిఫాబాద్, తిర్యాణి, న్యూస్‌టుడే

వానాకాలంలో జలుబు, దగ్గు, మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు ఎక్కువగా సోకుతుంటాయి. ఈసారి జ్వరాలు వచ్చిన వారిలో చాలా మందికి ఒళ్లు నొప్పులు రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. జ్వరాలు తగ్గినా.. నొప్పులు తగ్గక కొందరు మంచానికే పరిమితం కావాల్సి వస్తోంది. నిర్ధారణ పరీక్షల్లో చికున్ గన్యా నెగెటివ్ వస్తున్నా. . దాని లక్షణాల తరహాలోనే కాళ్లు, కీళ్ల నొప్పులతో కదలలేకుండా చేస్తున్నాయి. ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తుండగా.. పేద కుటుంబాలు రోజుల తరబడి సర్కారు దవాఖానాల చుట్టూ తిరుగుతున్నారు. కొన్ని చోట్ల సరైన మందులు లేకపోవడంతో ప్రైవేటు ఔషధ దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు.

తిర్యాణి మండల కేంద్రానికి చెందిన పడాల నర్సాగౌడ్.. నెల రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నారు. మధ్యలో తగ్గినా మళ్లీ వచ్చింది. అయితే ఒళ్లు నొప్పులతో లేవలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. భార్య లక్ష్మికి సైతం జ్వరం వచ్చి, తగ్గినా ఒళ్లు నొప్పులు అలాగే ఉన్నాయని, ఏ పని చేయలేక పోతున్నట్లు వాపోతున్నారు.



118 శిబిరాలు.. 987 మందికి జ్వరాలు

జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు 22 వరకు ఉన్నాయి. ఇవే కాకుండా 56 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. సీజనల్ వ్యాధులతో నిత్యం రోగులు ఆసుపత్రుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో 118 వైద్య శిబిరాలు నిర్వహించి 987 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. రక్తపూతలు సేకరించారు. అయినా జ్వరాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇక్కడ ఇన్ని ఆసుపత్రులు ఉన్నా.. ప్రాథమిక చికిత్సలకే పరిమితమవుతోంది. అత్యవసరమైతే మంచిర్యాల, కరీంనగర్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి. జనవరి నుంచి జూన్ వరకు ఒక డెంగీ కేసు నమోదు కాగా జులైలో మరో పాజిటివ్ వచ్చింది. ఆగస్టులో 30 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ నెల ఇప్పటి వరకు 14 పాజిటివ్ కేసులు వచ్చాయి. మలేరియా సైతం జులైలో 13 పాజిటివ్, ఆగస్టులో 17 నమోదయ్యాయి. ఈ నెలలో ఇప్పటి వరకు రెండు కేసులు నమోదయ్యాయి.


తిర్యాణిలోని ఎస్సీ కాలనీకి చెందిన శేర్ల ఆశయ్య.. పక్షం రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. ఆయన భార్య, ముగ్గురు కుమారులు, కోడళ్లకు సైతం జ్వరం వచ్చింది. భార్యను మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రిలో మూడు రోజుల పాటు చికిత్స చేయించారు. రూ.10 వేలు ఖర్చయిందని, ఇప్పటికీ ముగ్గురు ఒళ్లునొప్పులతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన వాపోతున్నారు.

వైద్యులు సూచించిన కోర్సు విధిగా వాడాలి - తుకారాం, డీఎంహెచ్‌వో

ఆహారపు అలవాట్లు, వాతావరణంలో మార్పు, శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గడంతో జ్వరం వచ్చి తగ్గినా కొందరిలో ఒళ్లు నొప్పులు ఉంటున్నాయి. జ్వరం వచ్చినపుడు క్వాలిఫైడ్ వైద్యులకు చూపించాలి.. వారు సూచించిన కోర్సు ప్రకారం మందులు వాడాలి.

డీఎస్సీ అభ్యర్థులకు తప్పని నిరీక్షణ!

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన అటు వారిని, ఇటు అధికారులను హైరానాకు గురిచేసింది. బుధవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 341 వివిధ క్యాడర్లకు చెందిన ఉపాధ్యాయ పోస్టుల కోసం 1:3 నిష్పత్తిలో 1,023 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కోసం 11 కౌంటర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి సెకండరీ గ్రేడు టీచర్ పోస్టుల అభ్యర్థులు చాలామంది ఉదయం 10 గంటలకే చేరుకొన్నారు. ఎస్జీటీ తెలుగు మాధ్యమంలో స్థానిక సంస్థలు 183 పోస్టులు, ప్రభుత్వ యాజమాన్యంలో 7, ఉర్దూ మాధ్యమం 23, బెంగాలీ మాధ్యమంలో 16 పోస్టుల కోసం అభ్యర్థులను పిలిచారు. దీంతో పాఠశాల ప్రాంగణమంతా అభ్యర్థులతో సందడిగా మారింది.

సాంకేతిక కారణాలతో పరిశీలన కొంత ఆలస్యంగా మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో ప్రారంభమవడంతో నిరీక్షణ తప్పలేదు. ఎస్జీటీ అభ్యర్థులకు 5 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో.. పరిశీలన వేగంగా సాగింది. బెజ్జూరు లాంటి దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఈరోజే తమ ధ్రువపత్రాలు పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. మిగిలిపోయిన వారికి గురువారం ఉదయం ప్రాధాన్య క్రమంలో పరిశీలిస్తారని ప్రకటించారు. తనకు పాఠశాల విద్యాశాఖ నుంచి పరిశీలన కోసం మెసేజ్ వచ్చినప్పటికీ పరిశీలన కేంద్రం జాబితాలో పేరు లేదని ఓ అభ్యర్థి వాపోయారు. పరిశీలన కోసం వచ్చిన అభ్యర్థి ప్రదీప్‌కు చెందిన ఒరిజినల్ ధ్రువపత్రాల సంచి కనిపించకపోవడంతో ఉత్కంఠ ఏర్పడింది.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న వరంగల్ ఆర్జేడీ కె.సత్యనారాయణ రెడ్డి, చిత్రంలో డీఈవో యాదయ్య

ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శన

పరిశీలన కేంద్రాన్ని వరంగల్ ఆర్జేడీ కె.సత్యనారాయణ రెడ్డి, డీఈవో ఎస్.యాదయ్యతో కలిసి సందర్శించారు. పరిశీలన బృందాల వారి సందేహాలు తీర్చారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పుడు ధ్రువపత్రాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. మార్గదర్శకాల మేరకు పరిశీలన పక్కాగా జరగాలన్నారు. మొదటి రోజు 45మంది ధ్రువ పత్రాల పరిశీలన పూర్తయినట్లు డీఈఓ ప్రకటించారు. ఈ నెల 5లోగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట ఏసీజీఈ ఎం.ఉదయ్‌బాబు, డీఎస్‌వో కటుకం మధుకర్ తదితరులున్నారు.

పక్కాగా డిజిటల్ కార్డుల సర్వే నిర్వహణ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ సర్వేను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి పాల్గొని మాట్లాడారు. పైలట్ ప్రాజెక్టుగా ఆసిఫాబాద్ పుర పరిధిలోని 10వ వార్డు, కెరమెరి మండలంలోని ధనోరా పంచాయతీ, కాగజ్‌నగర్ పుర పరిధిలోని 14వ వార్డు, సిర్పూర్(టి) మండలం వెంకట్రావ్‌పేట పంచాయతీలు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 3-7 వరకు సర్వే పూర్తి చేయాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవోలు బృంద నాయకులుగా, పంచాయతీల్లో తహసీల్దార్, ఎంపీడీవో బృంద నాయకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. జాబితాలో ఉన్న పేర్లు, చరవాణి నంబర్లు సరిగా ఉన్నాయా లేవా సరిచూసుకోవాలని సూచించారు. మరణించిన, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లు నిబంధనల ప్రకారం తొలగించాలన్నారు. కొత్తగా వచ్చిన వారి పేర్లు నమోదు చేయాలని, ఉమ్మడి కుటుంబంలో వివాహమైన వారు ఉంటే వేర్వేరుగా నమోదు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం సర్వే విధానాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో పుర కమిషనర్లు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, సర్వే బృందాల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు


హస్నాపూర్ ఘాట్‌లో చెట్టుకింద కూర్చొని చరవాణిలో సమాచారాన్ని అప్‌లోడ్ అంగన్‌వాడీలు

నెట్‌వర్క్ తిప్పలు!

ఏజెన్సీ మండలాల్లో అంతర్జాల (ఇంటర్‌నెట్) సేవలు లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగుల కార్యకలాపాలకు ఇబ్బందులు తప్పడం లేదు. నెట్‌వర్క్ ఉన్న ప్రాంతాలకు వెళ్లి పనులు పూర్తి చేస్తున్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పిల్లల బరువు, ఎత్తు, హాజరు, తదితర వివరాలు చరవాణిలో అప్‌లోడ్ చేయడానికి అంతర్జాల సౌకర్యం కోసం ఉట్నూర్ వెళ్తున్నారు. ఆ మండలంలోని హస్నాపూర్ ఘాట్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తుండగా 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

- న్యూస్‌టుడే, జైనూర్, లింగాపూర్

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

రెబ్బెన, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థి వి.లిఖిత రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. గురుకుల కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న లిఖిత ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. లిఖితను పలువురు అభినందించారు.


వి. లిఖిత

క్రికెట్ పోటీలు ప్రారంభం

దహెగాం, న్యూస్‌టుడే : మండలంలోని ఖర్జీ గ్రామంలో పంచాయతీ స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎస్సై దీకొండ రమేష్, కందూరి రాజులు పోటీలను ప్రారంభించారు. 16 జట్లు పాల్గొననున్నాయి.

ఆటా పాటా.. వేడుకల బాట

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే

ప్రభుత్వ వైద్యకళాశాల మంచిర్యాల.. భారాస ప్రభుత్వం తొలి విడతగా ఏర్పాటు కళాశాలల్లో ఇది ఒకటి. బహుశా వైద్యవిద్య అభ్యసించే వారికి, వైద్యవృత్తిలో ఉన్నవారికి తప్పితే ఇక్కడి కళాశాల తెలిసింది చాలా తక్కువ మందికే. కానీ మొదటి సంవత్సరంలోనే రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. తొలి ఏడాది పరీక్ష ఫలితాల్లో 98 శాతంతో తొలి స్థానంలో నిలిచింది. రెండేళ్లు(రెండు బ్యాచ్‌లు)పూర్తిచేసుకుని మూడో బ్యాచ్(ఏడాది)కి సిద్ధమవుతోంది. కేవలం చదువుకే పరిమితం కాకుండా.. నిత్యం పుస్తకాలతోనే కుస్తీ పట్టి ఒత్తిడికి గురికాకుండా ఆటాపాటలతో ఉపశమనం పొందుతున్నారు ఇక్కడి విద్యార్థులు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, భక్తిబాటలో నడుస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఎక్కడెక్కడి నుంచో వచ్చామనే భావన రాకుండా.. ఇంటికి దూరంగా ఉంటున్నామనే ఆలోచన దరిచేరకుండా కుటుంబసభ్యుల మాదిరిగా కలిసి మెలిసి వేడుకలు నిర్వహిస్తున్నారు. బోధకులను సైతం భాగస్వాములను చేస్తూ జిల్లా కేంద్రంలో సందడి వాతావరణాన్ని తీసుకొస్తున్నారు.


స్వాగతోత్సవంలో..


వైద్యవిద్యలో భాగంగా జిల్లా కేంద్రంలో శిబిరంలో పాల్గొంటూ..

సంస్కృతి, సంప్రదాయాలపై వైద్యవిద్యార్థుల కార్యక్రమాలు


కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహ మండపం వద్ద విద్యార్థులు

ప్రతి ఉత్సవం.. కలిసికట్టుగా..

రెండు బ్యాచ్‌లు.. రెండు వందల మంది విద్యార్థులతో కళాశాల నిండుగా కనిపిస్తుంది. మొదటి ఏడాది విద్యార్థులు సీనియర్లుగా మారిపోయారు. రెండో ఏటా చేరిన వారు సైతం త్వరలో సీనియర్లు కానున్నారు. ఏటా వేడుకలను కలిసికట్టుగా నిర్వహిస్తున్నారు. మొదటి ఏడాది నుంచే క్రీడాదినోత్సవం, హోలీ, బ్యాచ్ పార్టీ, ఇఫ్తార్ విందు, పరీక్షల ఫలితాల అనంతరం వైభవోపేతంగా సరస్వతిపూజ, స్వాగతోత్సవం, ఆచార్యుల పదవీ విరమణ వేడుకలు, ఉపాధ్యాయ దినోత్సవం, ఇటీవల ఆధ్యాత్మిక వేడుకైన వినాయక విగ్రహ ఏర్పాటు ప్రత్యేక పూజలు, రోజుకో తీరు ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా ప్రతి వేడుకను ఓ పద్ధతిగా, చూడముచ్చటగా జరిపిస్తున్నారు. కళాశాలలో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంచుతున్నారు.

ప్రభుత్వ వైద్యకళాశాల అనుమతి వచ్చింది.. సొంత భవనం లేదు. వసతి గృహాలు అందుబాటులోకి రాలేదు. అయినా 98 శాతం ఉత్తీర్ణతతో తొలి ఏడాదే రాష్ట్రం మొత్తం మంచిర్యాల వైపు చూసేలా చేశారు. 24 గంటలు పుస్తకాలకే పరిమితం కాలేదు.. ఆటపాటలకు దూరంగా అసలే లేరు. పేరుపొందిన వైద్య కళాశాలల మాదిరిగా ఇక్కడా అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. మంచిర్యాల వైద్య కళాశాలను ఔరా అనిపించేలా చేశారు.



మేమున్నాం.. మీకు తోడుగా..

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066
(10 AM TO 1 PM)

రెబ్బెన, న్యూస్‌టుడే

? మండలంలోని గంగాపూర్‌లో నిత్యం విద్యుత్తు స్తంభాలకు దీపాలు నెలల తరబడి వెలుగుతున్నాయి. ఎవరూ పట్టించుకోవడంలేదు. విద్యుత్తు వృథా అయ్యే అవకాశం ఉంది. **- రమేష్, గంగాపూర్**

✔ త్వరలోనే ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయిస్తా.
- మురళీధర్, పంచాయతీ కార్యదర్శి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

? జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడి పోచమ్మ ఆలయం పక్క గల్లీలో ఇళ్ల నుంచి వచ్చే నీరు రోడ్డుపై నిలుస్తోంది. ఆ మార్గం గుండా నడిచే పరిస్థితి లేదు. ఇది వరకు అక్కడ కచ్చా మురుగు కాలువ ఉండేది. దాన్ని మూసేయడంతో నీరు బురదగా మారుతోంది. నీరు నిల్వ ఉండకుండా చూడాలి **- సతీష్, కసాబ్‌వాడి**

✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.
- భుజంగ్‌రావు, పుర కమిషనర్

నిబంధనలు పాటించకపోతే చర్యలు

కౌటాల, న్యూస్‌టుడే : ఆటో డ్రైవర్లు, యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని కౌటాల సీఐ ముత్యం రమేష్ హెచ్చరించారు. బుధవారం కౌటాల సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఆటోడ్రైవర్లు, యజమానులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ఎస్సై మధుకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ఆటోలపై నంబర్లు వేస్తున్న సీఐ రమేష్

వాంకిడి: ఆటో డ్రైవర్లు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై ప్రశాంత్ అన్నారు. బుధవారం సాయంత్రం పోలీసుస్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి, నిబంధనలపై అవగాహన కల్పించారు. మండలంలో తిరిగే ఆటోలపై టాప్ నంబర్లు నమోదు చేయాలన్నారు. డ్రైవరు సీటుకు ఇరువైపులా ప్రయాణికుల సీట్లను కలిగి ఉన్న ఆటోలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.


ఇనుప సామగ్రి చోరీ

రెబ్బెన, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజయస్వామి ఆలయంలో ఉన్న ఇనుప సామగ్రి చోరీకి గురయ్యాయి. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయ ప్రాంగణంలో ఉన్న 140 ఇనుప గడ్డలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కెరమెరి, న్యూస్‌టుడే : మండలంలోని అనార్‌పల్లిలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. రైతు రాఠోడ్ పర్శురాం బుధవారం సాయంత్రం తన ఇంటి ఆవరణలో ఎడ్ల జతను కట్టేశాడు. పైనుంచి గ్రామానికి సరఫరా అయ్యే విద్యుత్తు తీగ ఒక్కసారిగా తెగి వాటిపై పడటంతో ఒక ఎద్దు అక్కడికక్కడే చనిపోయింది. ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం




గాంధీ చిత్రపటం వద్ద కొబ్బరికాయ కొడుతున్న ఎస్పీ డి.వి.శ్రీనివాస్‌రావు


జైనూరు మండలం అడ్డెసరలో..


గాంధీ విగ్రహం, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు


బెజ్జూరులో..

జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాగజ్‌నగర్‌లోని గాంధీ పార్కులో ఉన్న గాంధీ విగ్రహం, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పూలమాలలతో నివాళ్లర్పించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవలో భాగంగా భాజపా జిల్లా అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలిసి పార్కును శుభ్రం చేశారు. గాంధీ ఆచరించిన బాట, చెప్పిన మాట నేటి యువతకు ఆచరణీయమని, ఆయన అడుగు జాడల్లో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు.

- న్యూస్‌టుడే, జిల్లా బృందం


సిర్పూర్(టి)లో..


వాంకిడిలో.. కాంగ్రెస్ నాయకులు


కౌటాల ఎంపీడీఓ కార్యాలయంలో..


చింతలమానెపల్లిలో..


గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వృద్ధులు


తిర్యాణి: పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి


గోలేటిలో.. తెబొగకాసం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు


గోలేటి అంగన్‌వాడీ కేంద్రంలో గాంధీ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ మంజుల, చిన్నారులు


లింగాపూర్‌లో..

మినీ స్టేడియం ఏర్పాటుకు వినతి

వాంకిడి, న్యూస్‌టుడే: రాష్ట్ర యువజన, క్రీడల విభాగ కార్పొరేషన్ ఛైర్మన్ శివసేనారెడ్డిని బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు ముండె దీపక్ హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిశారు. వాంకిడి మండలంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్పీఎం మహిళా మండలి సభ్యులు బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాదం చేపట్టినట్లు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కె..నాగేశ్వర్‌రావు తెలిపారు. ఎస్పీఎం మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు అన్నుమిశ్రా, ప్రతిభారాయ్, సమితి సభ్యులు, పాల్గొన్నారు.

కొనుగోలు చేసి.. భరోసానిచ్చి

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకుని చేనేత వస్త్రాలు ఉపయోగించడం అలవాటు చేసుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోసిని పంచాయతీ బెజ్జూరు చేనేత సహకార సంఘంలో 'సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. చేనేత కార్మికులకు కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. సొసైటీ కార్యదర్శి నల్ల కనకయ్య, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తు అశోక్, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయ, తాలుకా కన్వీనర్ వీరభద్రచారి, పట్టణాధ్యక్షుడు సిందం శ్రీనివాస్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పారెపల్లి రాణి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


చేనేత వస్త్రాలు కొనుగోలు చేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్

శిక్షణ తరగతులు వాయిదా వేయాలి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: వివిధ పాఠశాలలు, కళాశాలల్లో నూతనంగా నియమించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు దసరా సెలవుల్లో నిర్వహించనున్న శిక్షణ తరగతులను వాయిదా వేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాసరావు, చునార్కర్ అనీల్, యూఎన్ చారి కోరారు. ఈ నెల 4-8 వరకు హైదరాబాదులో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారని, బతుకమ్మ సంబరాలను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేయాలన్నారు.

ఎంగిలిపూల బతుకమ్మతో సందడి మొదలాయె


ఆసిఫాబాద్-పైకాజీనగర్‌లో బతుకమ్మలతో చిన్నారులు..


గోలేటిలో జీఎం శ్రీనివాస్, సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి, తదితరులు


ఆసిఫాబాద్-వాసవి మందిరంలో..

జిల్లాలో బతుకమ్మ సంబరాలు బుధవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇళ్లలో వేకువజాము నుంచే పూల సేకరణ కోసం పరుగులు, పొద్దంతా ఎంగిలిపూల బతుకమ్మలు పేర్చడంలో నిమగ్నమైన మహిళలు, యువతులు.. సాయంత్రం నూతన వస్త్రాలంకరణలతో బతుకమ్మలను నెత్తిన ఎత్తుకొని సమీప ఆలయాలు, కూడళ్లకు వెళ్లి ఆడిపాడారు. ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ, డీజే పాటలతో వీధులకు కొత్త కళ వచ్చింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు దాండియా, జానపద, కోలాటాలతో అలరించారు.

- ఆసిఫాబాద్ అర్బన్, వాంకిడి, దహెగాం, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే


గోలేటిలో బతుకమ్మల వద్ద కార్మిక కుటుంబాల మహిళలు


ఆసిఫాబాద్ వాసవీమాత ఆలయంలో..


కాగజ్‌నగర్‌లో యువతులు, చిన్నారుల సందడి


అరుణోదయ పాఠశాల వద్ద బతుకమ్మలతో మహిళలు

కులవివక్ష నిర్మూలనే లక్ష్యం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: కుల వివక్ష నిర్మూలనే లక్ష్యంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఏర్పడినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి దినకర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. సామాజిక అంశాలపై సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాల సాధన కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, రామయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టికానంద్, కార్తీక్, తిరుపతి, మనోహర్ తదితరులున్నారు.

మొదటి రోజు నామినేషన్లు సున్నా

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికల్లో పోటీచేసేందుకు మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎన్నికల అధికారులు బూర సమ్మయ్య, గడదాసు నారాయణలు తెలిపారు. ఈ నెల 4 వరకు ఉదయం 11-3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, పట్టణంలోని ఆయా వార్డుల్లో 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటింటికీ ఓటరు చిటీల పంపిణీతోపాటు ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్టు పేర్కొన్నారు. గడదాసు శంకర్, వంగరి రవికుమార్ పాల్గొన్నారు.

సంఘానికి చేసిన సేవలు మరువలేనివి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: బెల్లంపల్లి ఏరియా సింగరేణిలో పనిచేస్తూ సంస్థ, తెబొగకాసానికి ఖైరిగూర ఓసీపీ కార్మికులు కార్నాథం వెంకటేషం, దాసరి బాబురావు చేసిన సేవలు ఎనలేనివని ఆ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు కొనియాడారు. బుధవారం గోలేటిలోని సంఘ కార్యాలయంలో ఇటీవల మెడికల్ అన్ ఫిట్ అయిన కార్మికులు వారిద్దరికీ వీడ్కోలు ఏర్పాటు చేసి సన్మానించారు. సంఘం కేంద్ర కమిటీ సభ్యులు మంగీలాల్, చంద్రశేఖర్, సత్యనారాయణ, ఏరియా కార్యదర్శులు మారిన వెంకటేశ్వర్లు, సంపత్, పిట్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంపై అవగాహన

బెజ్జూరు, న్యూస్‌టుడే: మండలంలోని సలుగుపల్లి గ్రామ రైతులకు నానో యూరియా వాడకంపై ఒడిశాకు చెందిన రూరల్ డెవలప్‌మెంట్ ఫార్మర్స్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యార్థి సిడాం సాయిదీపిష్ అవగాహన కల్పించారు. 45 కిలోల యూరియా సంచిలో 46 శాతం నత్రజని ఉంటుందని, మొక్కలు పెరిగే సమయంలో రెండు నుంచి నాలుగు మిల్లీలీటర్ల నానో యూరియా చేరి ఏపుగా పెరుగుతుందని వివరించారు. నానో యూరియాతో ఎరువుల మోత తప్పుతుందన్నారు.


కండువాలు కప్పుతున్న కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్

కాంగ్రెస్‌లో చేరికలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో.. బుధవారం దుబ్బగూడం, పారిగాం గ్రామాలకు చెందిన పలువురు పార్టీలో చేరారు. డోర్కె సుధాకర్, అంబదాస్, జాడె మల్లు, నక్క శంకర్, చిలుముల భాగ్య, నక్క రాధ, వినోద్, సంతోష్, మహేష్, పత్రు తదితరులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ సిద్దాల దేవయ్య, మాజీ జడ్పీటీసీ రాంనాయక్, కొయాడ రమేష్‌గౌడ్, చౌదరి తిరుపతి, సమీర్ తదితరులున్నారు.

స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తాం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్‌లో అనేక మంది కళాకారులున్నారని, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ప్రాంతంలో చిత్ర నిర్మాణ సన్నివేశాలు చేపడుతున్నట్లు సినీ, టీవీ నటుడు అప్పారావు తెలిపారు. ఆత్మకూరి మల్లికార్జున్ దర్శకత్వంలో రమ్య ఆర్ట్స్ ప్రొడక్షన్ నం.1 ఆధ్వర్యంలో నిర్మించనున్న ఓటీటీ చిత్రం షూటింగ్‌ను బుధవారం పట్టణంలోని ఓ ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాల అనంతరం ముహూర్తం సన్నివేశాన్ని చిత్రీకరించారు. పురపాలిక మాజీ ఛైర్మన్ దస్తగిర్ క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. లఘుచిత్రాల దర్శకుడు ఈర్ల సునీల్‌కుమార్, చంద్రమౌళి తదితరులున్నారు.



నటుడు అప్పారావుపై ముహూర్తపు సన్నివేశాన్ని ప్రారంభిస్తున్న పుర మాజీ ఛైర్మన్ దస్తగిర్

అదుపుతప్పి లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

రెబ్బెన, న్యూస్‌టుడే: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూర ఓపెన్‌కాస్టు సమీపంలో బుధవారం మట్టిని తరలిస్తుండగా ట్రాన్స్‌పోర్టు లారీ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ మహేష్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతన్ని గోలేటి డిస్పెన్సరీకి, మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్, భాజపా జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ బాధితున్ని పరామర్శించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

★ ఊపిరాడక 21 జీవాల మృత్యువాత

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట్ మండలం బొక్కివాగు వంతెన సమీపంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం చేసిన తనిఖీల్లో నాలుగు లారీల్లో 149 పశువులను ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండటాన్ని గుర్తించామన్నారు. విచారణలో మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. వీటిలో 21 జీవాలు మృతిచెందాయని, మిగతా వాటిని కోశిని గ్రామంలోని రాధాగోపాల కృష్ణ గోశాలకు తరలించినట్లు చెప్పారు. నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు లారీ డ్రైవర్లు పరారీలో ఉన్నారన్నారు.

దేవి నవరాత్రులకు వేళాయె!

★ ఇద్దరు అమ్మవార్లు కొలువైన ఏకైక ఆలయం



రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఇటు గ్రామాల్లో, అటు సింగరేణి గనుల, విభాగాల ఆలయాలు ముస్తాబయ్యాయి. అమ్మవారి నవరాత్రులను కనుల పండువగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇందిరానగర్‌లోని దేవస్థానం శ్రీ కనకదుర్గాదేవి, స్వయంభూ శ్రీ మహంకాళి అమ్మవార్లతో కొలువై జిల్లాలోనే ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించింది. ఆలయంలో ఈ సారి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుత్తుదీపాలతో అలంకరించారు. ఇక్కడి ఆలయంలోని భూగర్భంలో ఏర్పాటు చేసిన మహంకాళి అమ్మవారి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పది రోజుల పాటు వివిధ అవతారాలతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తుంది. మొదటి రోజు **బాలాత్రిపుర సుందరి,** రెండు: **గాయత్రి దేవి,** మూడు: **అన్నపూర్ణాదేవి,** నాలుగు: **లలితా త్రిపుర సుందరిదేవి,** అయిదు: **మహాచండీదేవి,** ఆరు : **మహాలక్ష్మి దేవి,** ఏడు: **సరస్వతిదేవీ,** ఎనిమిది : **దుర్గామాతదేవీ,** తొమ్మిదో రోజు **మహిషాసురమర్ధినిగా,** పదో రోజు **శాంత స్వరూపిణి శ్రీ రాజరాజేశ్వరిదేవి** రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఇందుకు తగ్గట్టుగానే అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్, ప్రధాన అర్చకుడు దేవర వినోద్ తెలిపారు. రోజూ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం అమ్మవారి హోమం ఉంటుందని చెప్పారు. విజయదశమి రోజు అమ్మవారి ఊరేగింపు, వాహన పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


ఇందిరానగర్‌లో ముస్తాబైన ఆలయం

చేతులు కలిపారు.. బడిని బతికించారు

న్యూస్‌టుడే, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ :

గ్రామస్థుల తోడ్పాటు, తల్లిదండ్రుల అండ, గ్రామ ఉద్యోగుల సహకారం వెరసి ఆ ప్రభుత్వ బడి నేడు సమస్యలు లేని ఆదర్శ బడిగా రూపుదిద్దుకుంది. అదే బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల.

బజార్‌హత్నూర్ మండలం పిప్పిరిలో గతేడాది 50 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసించేవారు. పిల్లల సంఖ్య తగ్గడంతో గ్రామాభివృద్ధి కమిటీతో పాటు పిల్లల తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇద్దరే ఉండటం కారణంగా కనిపించింది. సమస్యను పరిష్కరించేందుకు వీడీసీ ఆధ్వర్యంలో ఒక వాలంటీరును నియమించారు. అతడికి నెలకు రూ. 7,500 పారితోషికం అందించారు. ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలోనే పిల్లల పోషకులు, వీడీసీ, గ్రామ ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులు సమావేశమయ్యారు. పాఠశాలలోని సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా అడుగులు వేశారు.


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న గ్రామస్థులు నియమించిన విద్యా వాలంటీరు


పిప్పిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ఇలా ముందుకు సాగుతున్నారు

పాఠశాల ప్రారంభంలోనే గ్రామస్థులంతా సమావేశమయ్యారు. ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో అప్పటికే కొనసాగుతున్న వీవీతో పాటు పోషకులు తమ సొంత ఖర్చులతో మరో వీవీని నియమిస్తామని ముందుకొచ్చారు. ఇందుకు ఒక కమిటీని నియమించుకున్నారు. ప్రతి నెల అతడికి రూ.6 వేల పారితోషికం అందిస్తున్నారు. దాతల సహాయంతో కుర్చీలను అందించారు. రూ.40 వేలు ఖర్చు చేసి రెండు గేట్లను ఏర్పాటు చేశారు. రూ.10 వేల ఖర్చుతో బీరువా కొన్నారు. రూ.10 వేలతో ఐడీ కార్డులు అందించారు. ఓ స్వచ్ఛంద సంస్థ తోడ్పాటుతో 70 బ్యాగులు అందించారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 67కి చేరింది. ఇటీవల ఒక ఉపాధ్యాయుడు రావడంతో ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ఇద్దరు వాలంటీర్లు అక్కడ పని చేస్తున్నారు. బడి తోటతో పాటు పరుచుకున్న పచ్చదనం పాఠశాలకు ఎంతో అందాన్నిస్తుంది.

చాలా సంతోషంగా ఉంది

- సురేందర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు



పాఠశాల అభివృద్ధికి పిల్లల పోషకులు, వీడీసీ సంఘం సభ్యులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వ తోడ్పాటుతో పాటు గ్రామస్థుల సహకారంతో పాఠశాలను తీర్చిదిద్దుకుంటున్నాం.

ఇక్కడే చదివిస్తాం

- రాజేందర్, పోషకుడు



ప్రైవేటులో వేలల్లో ఫీజులు కట్టి చదివించే స్తోమత లేదు. పాఠశాలలో సమస్యలు తీర్చేందుకు వీడీసీతో పాటు దాతలు ముందుకొస్తున్నారు. మేము కూడా కొంత మా పిల్లల కోసం ఖర్చు చేస్తున్నాం. నాణ్యమైన విద్య ఇక్కడే దొరుకుతోంది.

ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య


- భోజారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు పిప్పిరి



ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య అందుతుంది. మా సంఘ సభ్యులంతా కలిసి చిన్నపాటి సమస్యలను పరిష్కరించుకొని బడిని బాగు చేసుకుంటున్నాం. పిల్లలను పోషకులు ప్రభుత్వ బడికి పంపడమే మా కోరిక.

దుమ్ము దులిపేస్తోంది..!

● సింగరేణిలో వాయు కాలుష్య నియంత్రణ యంత్రం ప్రారంభం



సింగరేణి అంటే బొగ్గు గనులతో కూడిన ప్రాంతం. నిత్యం బొగ్గు లారీలు, పెద్ద వాహనాల రాకపోకలతో రోడ్డ వెంబడి దుమ్ము, ధూళి విపరీతంగా వ్యాపిస్తుంటుంది. వాయు కాలుష్యానికి కారణమవుతుంది. యాజమాన్యం ఏటా లక్షల కోట్ల మొక్కలు పెంచుతూ కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నా.. మరింత నియంత్రణకు ఆధునిక సాంకేతికతతో కూడిన ఓ యంత్రాన్ని కొనుగోలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరు జిల్లాలో గనులు విస్తరించి ఉండగా.. బెల్లంపల్లి ఏరియాలో మొదటగా ఈ యంత్రాన్ని ప్రవేశపెట్టింది.

ఇలా పనిచేస్తుందంటే..

బొగ్గు గనుల ప్రాంతంలో వాయు కాలుష్య నియంత్రణ, కార్మిక సంక్షేమానికి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. రోడ్లపై దుమ్ము, ధూళిని నియంత్రించేందుకు కదిలే వాయు కాలుష్య (ఫాగ్ కెనాన్) యంత్రాన్ని బెల్లంపల్లి ఏరియాలో గత నెల 25న ప్రారంభించింది. గనుల ఏర్పాటులో భాగంగా ఈసీ సూచన మేరకు తొలిసారిగా దీన్ని ఏర్పాటు చేశారు. మూడేళ్ల కాలపరిమితితో టెండరు ప్రక్రియ ద్వారా రూ.1.23 కోట్లు వ్యయం చేశారు. ఒక లారీకి నీటి ట్యాంకర్, 30 కేవీ జనరేటరును బిగించారు. ఢిల్లీ నుంచి తీసుకొచ్చిన ఈ యంత్రాన్ని లారీ వెనుక భాగంలో అమర్చారు. లారీ నడుస్తున్న తరుణంలో దాని నుంచి నీళ్ల తుంపర్లు దూసుకొని వస్తుంటాయి. దీంతో దుమ్ము నివారణతో పాటు గాలిలోని కాలుష్యాన్ని నివారించేందుకు దోహదపడుతుంది.

ఏయే ప్రాంతాల్లో..

ఖైరిగూర ఓసీపీ నుంచి గోలేటి సీహెచ్‌పీ వరకు సింగరేణి రహదారి మీదుగా నిత్యం బొగ్గు లారీల రాకపోకలు కొనసాగుతుంటాయి. ఈ యంత్రాన్ని ఖైరిగూర ఓసీపీ నుంచి గోలేటి టౌన్‌షిప్, దుబ్బగూడెం, భగత్‌సింగ్‌నగర్, రేపల్లెగూడ, గోలేటి క్రాస్ రోడ్డు మీదుగా గోలేటి సీహెచ్‌పీ వరకు నిత్యం తిప్పుతుంటారు. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ యంత్రం ఎంతో దోహదపడుతుందని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. - న్యూస్‌టుడే, గోలేటి టౌన్‌షిప్

నర్సరీల ఏర్పాటుపై దృష్టి సారించాలి

ఏసీసీ, న్యూస్‌టుడే : జిల్లాలో నర్సరీల్లో మొక్కల పెంపకంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 సంవత్సరానికి గాను నిర్దేశించిన ప్రణాళికను అమలుచేయాలన్నారు. పనులను గుర్తించి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో నర్సరీ ఏర్పాటుకు స్థలాన్ని ఈ నెల 5లోగా గుర్తించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్డీవో కిషన్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో గణపతి పాల్గొన్నారు.

బాలాలయంలోనే.. గంగనీళ్ల ఉత్సవాలు

● శని, ఆదివారాల్లో జాతర


బాలాలయంలో పోచమ్మ తల్లి

సారంగాపూర్, న్యూస్‌టుడే: వరుసగా రెండో ఏడాది 'గంగనీళ్ల' జాతర ఉత్సవాలు అడెల్లి మహా పోచమ్మ బాలాలయంలోనే జరగనున్నాయి. నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చినా అమ్మవారిని ఆలయంలో ప్రతిష్ఠించనందున నూతన ఆలయం ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నెల 5, 6వ తేదీల్లో జాతర జరగనుండగా ఈవో రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. దసరాకు ముందు వచ్చే మహాలయ అమావాస్య తదుపరి శని, ఆదివారాల్లో గంగనీళ్ల జాతర జరపడం ఆనవాయితీ. శనివారం ఉదయం 11 గంటలకు బాలాలయంలో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలుచేసి, అమ్మవారి ఆభరణాలతో ఆలయ సేవాదారులు శోభాయాత్రగా గోదావరి నదికి పయనమవుతారు. అడెల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర సారంగాపూర్, యాకర్‌పల్లి, వంజర్, ప్యారమూర్ మీదుగా దిలావర్‌పూర్ మండలం మాడెగాం, దిలావర్‌పూర్, కంజర్, సాంగ్వి గ్రామాల నుంచి సాయంత్రానికి గోదావరి తీరానికి చేరుతుంది. రాత్రికి అక్కడే జాగరణ చేస్తారు. ఆదివారం వేకువజామున గోదావరి నీటితో ఆభరణాలను శుద్ధి చేసి పాదయాత్రగా తిరిగి అదే మార్గంలో సాయంత్రానికి పోచమ్మ ఆలయానికి చేరుకుంటారు. తీసుకొచ్చిన జలాలను స్థానిక కోనేటి నీటితో కలిపి అమ్మవారికి అభిషేకం చేసి ఆభరణాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం భక్తులు దర్శించుకోవడంతో జాతర ముగుస్తుంది.

ఏర్పాట్లు పూర్తి:

జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశాం. ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయినా మందిరం ప్రారంభం కాకపోవడంతో బాలాలయంలోనే జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తులకు తాగునీరు, ఇతర వసతులు కల్పించాం. నిర్మల్, భైంసా డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు సైతం నడపాలని విజ్ఞప్తి చేశాం. -రమేష్, ఆలయ ఈవో

సామాజిక మాధ్యమాల పోస్టులపై ప్రత్యేక నిఘా

మంచిర్యాలనేరవిభాగం : చట్టవ్యతిరేకమైన పలు పోస్టులను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మతాన్ని, కులాన్ని ద్వేషించేలా చేస్తున్న పోస్టులపై పోలీసుల నిఘా ఉందని, ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి ఒడిలో దేవాపూర్!


ఎత్తయిన కొండల దిగువన, చుట్టూ దట్టమైన అడవుల మధ్యలో దేవాపూర్ గ్రామం

అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ వర్షాలతో పచ్చదనం సంతరించుకుంది. కొండాకోనల్లో ఎక్కడ చూసినా జలపాతాల గలగలలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. గూడేలు, తండాలే కాదు పెద్ద పంచాయతీలు సైతం పచ్చదనం మాటున దాగి ఉన్నాయి. సాధారణంగా కొండాకోనల్లో దట్టమైన అడవుల్లో అయిదు నుంచి పది ఇళ్లు ఉండే చిన్న తండాలు దూరం నుంచి చూడటానికి అందంగా కనిపిస్తాయి. అక్కడ పూర్తిస్థాయిలో ప్రజలకు సౌకర్యాలు అందుబాటులో ఉండవు. ఇక్కడ మీకు ఎత్తయిన కొండల దిగువన, చుట్టూ దట్టమైన అడవుల మధ్యలో అందంగా కనిపిస్తున్న ఈ గ్రామం తలమడుగు మండలం దేవాపూర్. మండలంలోనే మేజర్ పంచాయతీగా పేరు పొందింది. ఇక్కడ 865 కుటుంబాలు ఉండగా జనాభా 2,955 మంది ఉన్నారు. ఎటు చూసినా పచ్చదనంతో పాటు చల్లని వాతావరణం వీరి సొంతం. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడటంతో పక్కనే ఆదిలాబాద్ పట్టణం సుమారు 9 కిలోమీటర్ల దూరంలో ఉన్నా.. అక్కడ ఉండేందుకు ఇక్కడి ప్రజలు ఇష్టపడరు. - ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, తలమడుగు

51 ఏళ్లుగా ఒకే తరహా విగ్రహాలు

● మందమర్రి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకత


పూజలు అందుకోనున్న దేవతామూర్తుల విగ్రహాలు

న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం: మంచిర్యాల జిల్లా మందమర్రి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో మాత్రం భిన్నం. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి సహకారంతో ఇక్కడ దేవీ శరన్నవరాత్రి వేడుకలను 1974 సంవత్సరం నుంచి 51 ఏళ్లుగా అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. సింగరేణి బొగ్గు గనులు ప్రారంభించిన కొత్తలో పశ్చిమబెంగాల్ నుంచి అధికారులు ఏళ్ల పాటు ఇక్కడ విధులు నిర్వహించారు. ఈ క్రమంలో కోల్‌కతా నగరంలో ప్రతిష్ఠించే కాళీమాత విగ్రహాన్ని పోలిన విధంగా ఇక్కడ అదే తరహా ప్రతిమలను తయారు చేయిస్తున్నట్లు పూజారి అనంతాచార్యులు తెలిపారు.

కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామానికి చెందిన కళాకారులు రెండు నెలల పాటు శ్రమించి మట్టి, గడ్డితో 7-8 అడుగుల విగ్రహాన్ని తయారు చేశారు. అమ్మవారి విగ్రహంతో పాటు వినాయకుడు, కుమారస్వామి, లక్ష్మీదేవి, సరస్వతి దేవి విగ్రహాన్ని సిద్ధం చేశారు. మొదటి నుంచి ఒకే తరహాలో విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తుండటం ఇక్కడి ప్రత్యేకత. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు మందమర్రి, మంచిర్యాల, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ ప్రాంతాల నుంచి సుమారు 80 వేల మంది భక్తులు వస్తుంటారు. దసరా రోజు రాత్రి ఇక్కడ పూజలు నిర్వహించిన తర్వాతనే సింగరేణి మైదానంలో సింగరేణి యాజమాన్యం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రామ్‌లీలా కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహిస్తారు.


బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి

అంబరం.. క్రీడా సంబరం

● ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు


తలపడుతున్న జట్లు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: క్రికెట్ అంటే అందరూ ఎంతో ఆసక్తి కనబరుస్తుంటారు. ఆ ఆటకు ఉన్న గుర్తింపే వేరు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను చూసి వారిలాగే తామూ ఎదగాలని దానిపై మక్కువ పెంచుకున్న ఎంతో మంది నిత్యం తర్ఫీదు పొందుతుంటారు. వివిధ టోర్నీల్లో ఆడి తమదైన ఆటతీరును ప్రదర్శిస్తుంటారు. అలాంటి వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. బుధవారం నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వీటిని చేపట్టగా ఉమ్మడి జిల్లాకు చెందిన నాలుగు జట్ల బాలురు హాజరయ్యారు. నాలుగు జిల్లాల మధ్య పోటీలు పోటాపోటీగా సాగాయి. ఫైనల్‌లో మంచిర్యాల, నిర్మల్ జిల్లా జట్లు తలపడగా విజేతగా నిర్మల్ జిల్లా నిలిచింది. విజేత జట్టు ఈనెల 7 నుంచి 10వ తేదీ మధ్య జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది.

అట్టహాసంగా ప్రారంభం

పోటీలకు నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్ చేసి ఆటపై ఉన్న మక్కువ చూపి టోర్నీ ప్రారంభించారు. అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని నిత్యం తర్ఫీదు పొందుతూ లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, దిలావర్‌పూర్ ఎంఈవో కె.శంకర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ పార్థసారధి, పెటా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భుక్య రమేశ్, కె.భోజన్న, క్రీడల నిర్వాహకుడు వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు రాష్ట్రపాల్, సాయి, గోపాల్, భూమేశ్, రాంరాజ్, శ్రీనివాస్, సంతోష్, సునీల్, సుదర్శన్, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచి..:



మాది తాంసి మండలం పొన్నారి గ్రామం. తల్లిదండ్రులు లతీష్‌రెడ్డి-గీతారెడ్డి వ్యవసాయం చేస్తుంటారు. నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. మక్కువను గుర్తించి అమ్మానాన్న నన్ను ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తూ అక్కడే ఓ శిక్షణ కేంద్రంలో తర్ఫీదు ఇప్పిస్తున్నారు. వికెట్ కీపర్‌గా రాణిస్తున్నాను. గత ఏడాది ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనగా నాలోని ప్రతిభను చూసి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. జడ్చర్లలో జరిగిన టోర్నీలో ఉత్తమ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడంతో నేషనల్‌కు ఎంపిక చేశారు. అయితే ఆ పోటీలు జరగలేదు. దీంతో అందులో పాల్గొనే అవకాశం రాలేదు. - ఓం క్షీరాజ్‌రెడ్డి, ఆదిలాబాద్

ఆల్‌రౌండర్‌గా..: సోమ ఇషాన్‌రెడ్డి, ఆదిలాబాద్



ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాను. ఏడేళ్ల ప్రాయంలో క్రికెట్‌పై మక్కువ పెరిగింది. మాది జైనథ్ మండలం పెండల్‌వాడ. తల్లిదండ్రులు ప్రభాకర్‌రెడ్డి-రాధారెడ్డి వ్యాపారం చేస్తుంటారు. నాలోని అభిరుచి గుర్తించి వారు నన్ను ఓ ప్రైవేటు శిక్షణ కేంద్రంలో చేర్పించారు. అక్కడ తర్ఫీదు పొందుతూ వివిధ పోటీల్లో పాల్గొన్నాను. ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాను. గత సంవత్సరం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో జరిగిన జోనల్ స్థాయిలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతోపాటు అక్కడ మంచి ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. అవి జరగకపోవడంతో ఆడే అవకాశం కోల్పోయాను.

రెండు నెలల వ్యవధి.. తండ్రీకుమార్తెలకు టీచరు కొలువులు


ఎస్జీటీగా ఎంపికైన కుమార్తె ప్రణయశ్రీతో కలిసి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన తండ్రి రమేష్

అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, భార్యాభర్తలు ఉద్యోగాలు సాధించడం సాధారణం. ఇందుకు భిన్నంగా రెండు నెలల వ్యవధిలో తండ్రీకుమార్తెలు టీచరు కొలువులకు ఎంపికయ్యారు. వారే జైనథ్ మండలం పిప్పర్‌వాడకు చెందిన వాయిలే రమేష్, ప్రణయశ్రీ. ఆగస్టు 2న సోషల్ వెల్ఫేర్ సొసైటీ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బాలుర గురుకులంలో హిందీ ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)గా వాయిలే రమేష్ ఎంపికై విధుల్లో చేరారు. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ప్రణయశ్రీ ఎంపికయ్యారు. ఓపెన్ కేటగిరీలో 42వ ర్యాంకును సాధించిన ఆ యువతి తండ్రితో కలిసి బుధవారం ఆదిలాబాద్ డైట్ కళాశాలలో నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. కొంతకాలంగా తండ్రీకుమార్తెలు తమ గ్రామంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో టీచర్లుగా పని చేస్తుండగా.. ఒకరి తర్వాత మరొకరు ప్రభుత్వ కొలువులకు ఎంపిక కావడం విశేషం. ఇంటి నుంచి ఒక్కరికే ఉద్యోగం రావడం గగనంగా మారిన ప్రస్తుత తరుణంలో తండ్రి 48 ఏళ్ల వయసులో.. ఆయన కుమార్తె 20 ఏళ్ల ప్రాయంలో సర్కారు కొలువులు సాధించి నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారు. వయోపరిమితి గడువు ముగుస్తున్న సమయంలో తనకు ఉద్యోగం రావడం సంతృప్తినిస్తే.. ఇప్పుడు అందరూ తండ్రికి తగ్గ తనయ అని కూతురిని పొగుడుతుంటే మనసు ఉప్పొంగుతోందని రమేష్ ఆనందం వ్యక్తం చేశారు.

- ఈనాడు - ఆదిలాబాద్

- న్యూస్‌టుడే - పాలనాప్రాంగణం

జాతీయస్థాయి ఖోఖోలో తెలంగాణ జట్టుకు రజతం



రజత పతకం సాధించిన తెలంగాణ జట్టు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఝార్ఖండ్‌లో నిర్వహించిన 34వ జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టు రజత పతకం సాధించింది. తుది పోరులో మహారాష్ట్ర జట్టుతో హోరాహోరీగా పోరాడి ఒక్క పాయింట్ తేడాతో ఓడి రన్నరప్‌గా నిలిచింది. తెలంగాణ జట్టులో ఉట్నూరు గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు సిడాం శంకర్, కుమ్ర సురేందర్, రాఠోడ్ శివసాయి, ఆత్రం శివచరణ్, పెందూర్ హన్మంతు, ఆత్రం యాదవ్‌షావ్ ఉండడం విశేషం. క్రీడాకారులను ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, డీడీ ఎ.వసంత్‌రావు, జిల్లా యువజన క్రీడల అధికారి వేంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ పీడీ దయానంద్ రెడ్డి, తెలంగాణ జట్టు కోచ్ శివకృష్ణ, ఉమ్మడి జిల్లా ఖోఖో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్, శ్రీధర్‌రెడ్డి అభినందించారు.